క్లుప్తంగా

కొండమల్లీశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు

వెదురుకుప్పం: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు చేపడుతున్నట్లు చెప్పారు. 15 ఏళ్లు పైబడిన పురుషులు 2,422, స్త్రీలు 1,181 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. క్రికెట్ జట్లు 65, వాలీబాల్ 27, బ్యాడ్మింటన్ 61, ఖోఖో 30, కబడ్డీ 37 జట్లు పోటీల్లో ఉంటాయన్నారు. నేటి నుంచి జనవరి 9 వరకు గ్రామ సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనవరి 10న మండల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయి నుంచి నియోజకవర్గం, జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత స్పాట్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి


అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సోమవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకామాక్షి సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం వద్ద వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు జి.నారాయణస్వామి నాయుడు మాట్లాడుతూ వాజ్‌పేయి భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. దేశ ప్రధానిగా వాజ్‌పేయి దేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేశారని కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కె.బాబు, యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఎం.సుబ్రమణ్యం, నగరి నియోజకవర్గ కన్వీనర్ కె.ఎస్.హరిబాబు, రూరల్ మండల అధ్యక్షుడు మురళి, జిల్లా చేనేత కార్యదర్శి వెంకటేష్, నాయకులు హరి, శేఖర్, బాబునాయుడు, సుబ్రమణ్యం, గిరిప్రసాద్, గోపి, లక్ష్మీరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం


కాలిపోయిన పూరి గుడిసె

వెదురుకుప్పం: మండలంలోని వైఎస్సార్ ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కళావతికి చెందిన పూరి గుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని బాధితులు తెలిపారు. పూరిల్లు పూర్తిగా కాలిపోవడంతో ఇంట్లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పచ్చికాపల్లం శ్రీలక్ష్మి ఎలక్ట్రానిక్స్ యజమాని ప్రసాద్ బాధిత కుటుంబానికి రూ.5 వేలు నగదు, వంట సరుకులు వితరణ చేశారు. దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లిషు మీడియం యాజమాన్యం బాధిత కుటుంబానికి అండగా నిలిచి దుస్తులు, దుప్పట్లు వంట పాత్రలు అందజేశారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రసాద్


కార్వేటినగరం: బేతేల్ షారోన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ లత


వెంగళరాజుకుప్పం : ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు


ఆముదాల చర్చిలో ఏసుప్రభును కొలుస్తూ ప్రార్థనలు

లోక రక్షకుడు.. ఏసుప్రభు

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- ఉత్సాహంగా పండుగను జరుపుకున్న క్రైస్తవులు
- పలు చర్చిల్లో వస్త్ర, అన్నదానం

నగరి : క్రిస్మస్ పండుగను నియోజకవర్గ వ్యాప్తంగా క్రైస్తవులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొత్తదుస్తులు ధరించి ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. ప్రత్యేక ఆరాధనలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థించుకున్నారు. చర్చిలను రంగురంగుల కాగితాలతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చర్చి పాస్టర్లు క్రైస్తవులకు సువాక్యములను బోధించారు. అలాగే పలువురికి విందుభోజనం పెట్టారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న బాల యేసు పాక, క్రిస్మస్ ట్రీలు ఆకర్షణగా నిలిచాయి. పిల్లలు ఇష్టపడే వస్తువులను పెద్దలు గిఫ్ట్ బాక్సులుగా కట్టి క్రిస్మస్ ట్రీకి వేలాడదీశారు. ఈ అలంకరణలు ఆకట్టుకున్నాయి. సీఎస్ఐ చర్చి, సీఎస్ఐ వెస్లీ చర్చి, సెయింట్ మేరీ చర్చి, ఆర్‌సీఎం, ఎల్‌ఈఎఫ్ చర్చి, అన్ని గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.

పుత్తూరులో..

పుత్తూరు: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ సోమవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీ చర్చిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు జోన్ పాల్, సెల్వం, ఆరుముగం, చిరంజీవి, సారకాయలు, మేరీ తదితరులు పాల్గొన్నారు.


నగరి: సెయింట్ మేరీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

నింద్రలో..

నింద్ర: మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఏసు అందించారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ఏసు జననం ఈ సృష్టికి ఓ శాంతి సందేశమని, ఏసు ఆగమనం మానవాళికి ఓ శాంతి దూత రాక అని ఎంపీపీ లత అన్నారు. బేతేల్ షారోన్ చర్చిలో సోమవారం పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ అనిత క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చర్చిలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. అనంతరం పాస్టర్ ఆశీర్వాదం మాట్లాడుతూ చర్చి అభివృద్ధికి కృషి చేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీరాములునాయుడు కుటుంబానికి ఎప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. అలాగే కార్వేటినగరంలోని యేహోవా ఈరే కార్నర్‌స్టోర్ చర్చిలో కూడా క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా కొల్లాగుంట సీఎస్ఐ, అల్లాగుంట సీఎస్ఐలతో పాటు పలు గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనుంజయ వర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, దినకర్, పాస్టర్లు పాల్గొన్నారు.

అన్నదానం

పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని అంబేడ్కర్ కాలనీ చర్చిలో పాస్టర్ దైవసహాయం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, పాస్టర్లు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం, దేవరగుడిపల్లె, తెల్లగుండ్లపల్లె, నెమళగుంట, ధర్మాచెరువు, నల్లవెంగనపల్లె గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు.

చీరల పంపిణీ

శ్రీరంగరాజపురం: మండలవ్యాప్తంగా చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేద మహిళలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ డాక్టర్ భాస్కర్‌రెడ్డి రాఘవ రాజపురంలో భారీ కేక్ కట్ చేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. పేదలకు దుస్తులు, స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గురవారెడ్డి, జనార్దన్, అమృత రాజ్, స్థానిక సర్పంచ్ మల్లికా ఆనంద్, పాస్టర్లు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మండలవ్యాప్తంగా చర్చిల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు ఘనగా జరిగాయి. మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిని విద్యుత్ దీపకాంతులతో ముస్తాబు చేశారు. జీడీ నెల్లూరు దళితవాడలో 1929లో నిర్మించిన చర్చిని పాస్టర్ సురేష్, ఉపదేశకులు సుందర రాజ్, సభమణియం రాజేష్ ఆధ్వర్యంలో అందంగా తీర్చిదిద్దారు. సోమవారం ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఏసుతోనే శాంతి

పాలసముద్రం : క్రిస్మస్ నాడు ప్రతిఒక్కరూ ఏసుక్రీస్తును మన కుటుంబాల్లోకి ఆహ్వానించాలని చర్చి పాస్టర్ పాల్ వెంకటేష్ తెలిపారు. సోమవారం క్రిస్మస్ సందర్భంగా మండలవ్యాప్తంగా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వెంగళరాజుకుప్పం, ఆముదాల చర్చిలలో పాస్టర్లు ఏసు ప్రభు గొప్పతనాన్ని వివరించారు.






కార్వేటినగరం: మహిళలకు చీరలు వితరణ చేస్తున్న ఎంపీపీ లత, పెనుమూరు: చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న దైవ సహాయం, నగరి: ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకున్న బాలయేసుపాక, చీరలు పంపిణీ చేస్తున్న జయప్రకాష్, శ్రీరంగరాజపురంలో..

కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

నగరి : మండలంలోని బీరకుప్పం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లక్ష్మమ్మ సోమవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఆమె భౌతిక కాయానికి మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అండగా ఉంటాం..

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం వడమాలపేట మండలం పాదిరేడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దిలీప్ తల్లి జమునమ్మ, వడమాలపేటకు చెందిన జగదీష్ అమ్మమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదీష్ కుటుంబానికి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి, నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం


మంత్రి నారాయణస్వామిని కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు ఒక్కతాటిపై ఉంటూ అఖండ విజయానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని సోమవారం రాత్రి పెనుమూరు మండల నాయకులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిని పుత్తూరులోని ఆయన స్వగృహంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనని చేసి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నారాయణస్వామిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేనకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. డిప్యూటీ సీఎం హోదాలో నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేసిన ఘనత నారాయణస్వామిదే అని వారు కొనియాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బండి కమాలకర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, రవిచంద్రారెడ్డి, దివాకర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, దాము, వెంకటేష్‌రెడ్డి, సాయివినయ్‌రెడ్డి, శ్రీనివాసులు, కమల్‌నాథ్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, జితేంద్ర, రంజిత్‌కుమార్, పలువురు యువకులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేతశ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పుటపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ జె.సుదర్శన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.


ఆలయ ధ్వజస్తంభం వద్ద సుదర్శనరెడ్డి, ఆలయ అధికారులు

ఓంశక్తి అమ్మవారికి పూజలు


ఓంశక్తి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాలసముద్రం : మండంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏట్టుకూరిపల్లెలో ఓంశక్తి భక్తులు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు ఓం శక్తి మాలలు ధరించిన భక్తులు అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకించారు. మధ్యాహ్నం అమ్మవారి చిత్రపటాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు. గురుస్వామి ఓం శక్తి భక్తులకు ఇరుముడి కట్టారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మేల్‌మరవత్తూరు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఇరుముడి కట్టుకుని వెళ్లారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

పుత్తూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పుత్తూరు రూరల్ మండలం కేబీఆర్‌పురంలో సోమవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొత్తం 32 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో విజేతలకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పోటీ విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు చొప్పున బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు వడివేలు, బలరామ్, చంద్రబాబు, ప్రేమ్‌కుమార్, టోర్నీ ఆర్గనైజర్స్ ఢిల్లీబాబు, వినోద్‌కుమార్, సాయి, మురళి పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం రేపు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఈ నెల 27వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, రవికెల సేకరణ లీజు హక్కు, అమ్మవారి ఫొటోలు, కీ చైన్లు వగైరాలు విక్రయానికి కౌలు హక్కు కల్పించనున్న సందర్భంగా ఈ బహిరంగ వేలం పాట చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ లీజు హక్కు డిసెంబర్ 27 నుంచి 2024 డిసెంబర్ 26వ తేదీ వరకు ఏడాదిపాటు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయం పని వేళల్లో సంప్రదించి వివరాలు పొందవచ్చని తెలిపారు.

నేటి నుంచి క్రీడా సమరం

- రాష్ట్ర క్రీడాచరిత్రలో అతిపెద్ద టోర్నీగా ఆడుదాం.. ఆంధ్ర
- గ్రామీణ క్రీడాకారులకు సువర్ణ అవకాశం


ఆడుదాం.. ఆంధ్ర పోటీలకు సిద్ధమైన నగరి డిగ్రీకళాశాల మైదానం

నగరి : రాష్ట్ర చరిత్రలో గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులకు బంగారు భవిష్యత్తును అందించడానికి ప్రభుత్వం నిర్వహించే ఆడుదాం ఆంధ్ర పోటీలు మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మున్సిపల్ పరిధిలో నిర్వహించే ఈ పోటీలకు డిగ్రీ కళాశాల మైదానం సిద్ధమైంది. మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు మున్సిపల్ పరిధిలోని 17 సచివాలయాలకు నిర్ణీత షెడ్యూలు మేరకు పోటీలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి తెలిపారు. మండల స్థాయిలో ఆయా సచివాయ పరిధిలోని క్రీడా మైదానాల్లో పోటీలు జరగనున్నాయి. నియోజకవర్గ పరిధిలోని 90 సచివాయాల పరిధిలో పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆయా ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, ప్రత్యేక అధికారులు పోటీలను ప్రారంభించనున్నారు. వరుస టోర్నమెంట్లతో మైదానాలు క్రీడాకారులతో కళకళలాడనున్నాయి. ఈ పోటీల నిర్వహణకు గాను క్రీడాకారులకు అవసరమైన క్రీడాసామగ్రిని కూడా ప్రభుత్వం పుష్కలంగా అందిస్తోంది. ఇప్పటికే ప్రతి సచివాలయానికి ఆడుదాం ఆంధ్ర క్రీడాసామగ్రి చేరుకుంది. గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి ఐదు దశల్లో పోటీలను నిర్వహించనున్నారు. ప్రతి దశలోనూ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంతో పాటుగా విజేతలను సర్టిఫికెట్లు, మెమెంటోలు, నగదు పురస్కారాలతో ప్రభుత్వం సత్కరించనుంది. 15 ఏళ్లు పైబడిన వయసున్న బాలబాలికలు అందరినీ పోటీల్లో భాగస్వాములను చేసేలా 'ఓపెన్ మీట్' పోటీలు కూడా జరగనున్నాయి. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విజేతలకు నగదు బహుమతులు అందిస్తారు. దీంతో ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో పాల్గొనేందుకు యువత ఎంతో ఉత్సాహం చూపుతున్నారు.


సచివాలయంలో ఆడుదాం ఆంధ్ర కిట్

నేడు ఎస్ఆర్ఎస్‌లో ....

పుత్తూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం పుత్తూరు పురపాలక సంఘం పరిధిలోని 13 వార్డు సచివాలయాలకు సంబంధించిన పోటీలను స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, గేటుపుత్తూరులోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేఎల్‌ఎస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మున్సిపల్ చైర్మన్ ఎ.హరి పోటీలను ప్రారంభిస్తారని అన్నారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు, క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకృష్ణుడి అభయం


తిరుచ్చిపై భక్తులకు దర్శనిమస్తున్న శ్రీకృష్ణ సమేత రుక్మిణి సత్యభామ

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో బంగారు తిరుచ్చిపై రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం శ్రీకృష్ణ స్వామివారి జన్మనక్షత్రమైన రోహిణి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం అభిషేక సేవను చేపట్టి, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితులైన స్వామి, అమ్మవార్లు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రుక్మిణి సత్యభామ సమేత తిరుచ్చిపై కొలువైన దేవేరులను దర్శించుకున్న భక్తులు, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్జితం ఇన్స్పెక్టర్ ధనశేఖర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేపచెట్టు నుంచి పాలధార

నారాయణవనం: మండల కేంద్రం నారాయణవనంలో వేపచెట్టు నుంచి పాలు కారుతుండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నారాయణవనం ఎగువ కోటవీధిలోని సుమారు 20 అడుగుల వేప చెట్టు నుంచి ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పాలు కారడాన్ని మహిళలు గుర్తించారు. ప్రారంభంలో కొద్దిగా కారుతున్న పాలధార క్రమంగా పెరగడంతో మహిళలు, పిల్లలు గుంపులు గుంపులుగా తరలివచ్చి చూస్తున్నారు.


వేపచెట్టు నుంచి కారుతున్న పాలధార